రావయ్య.. బొజ్జ గణపయ్య!



ఇబ్రహీంపట్నం మార్కెట్లో అమ్మకానికి సిద్ధంగా గణనాథుల ప్రతిమలు



మండపాల అలంకరణ సామగ్రి విక్రయాలు

- నేడు మండపాల్లో కొలువుదీరనున్న గణనాథుల విగ్రహాలు
- ఇబ్రహీంపట్నం మార్కెట్‌లో జోరుగా విక్రయాలు

ఇబ్రహీంపట్నం: వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని బుధవారం బొజ్జ గణపయ్యలు మండపాల్లో కొలువుదీరనున్నారు. పార్వతీపరమేశ్వరుల తనయుడి నవరాత్రోత్సవాలకు పల్లెలు, పట్టణాలు ముస్తాబయాయి. వాడవాడలలా మండపాలను అందంగా తీర్చిదిద్దారు. ఇప్పటికే గణేశ్ విగ్రహాలు ఆయా మండపాలకు తరలాయి. చిన్నా పెద్ద అందరూ పండుగ వాతావరణంలో మునిగిపోయారు. పూజలో కావాల్సిన పూలు, పత్రి, విగహాల కొనుగోళ్లు జోరందుకున్నారు. ఇబ్రహీంపట్నం వ్యాప్తంగా గణేశ్ నవరాత్రి శోభ సంతరించుకుంది.

మట్టి గణపతులనే వినియోగించాలి

ఇబ్రహీంపట్నం: వినాయక చవితి రోజు మట్టి గణనాథులనే పూజించాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రాధిక అన్నారు. ఎన్‌ఎస్‌ఎస్ మూడు విభాగాల ఆధ్వర్యంలో మంగళవారం ఇబ్రహీంపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మట్టి గణపతులను తయారు చేసి వితరణ చేశారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఇంట్లో, వాడలో మట్టి గణపతి ప్రతిమలను ప్రతిష్ఠించుకోవాలని పిలుపునిచ్చారు.

విద్యార్థులతో విగ్రహాల తయారీ

యాచారం: వినాయక చవితి పండుగను పురస్కరించుకొని నక్కర్తమేడిపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం గణపతి విగ్రహాల తయారీ పోటీలు నిర్వహించారు. పీఆర్‌జీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ పోటీలు జరిగాయి. విద్యార్థులు ఆసక్తిగా పాల్గొని మట్టి గణపతి విగ్రహాలను తయారు చేశారు. ఐదుగురికి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఉదయశ్రీ, పీఆర్‌జీ ఫౌండేషన్ అధ్యక్షుడు రవీందర్‌గుప్తా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఆమనగల్లులో వినాయక విగ్రహాలు కొనుగోలు చేస్తున్న యువత

పాఠశాలల్లో గణేశ్ ఉత్సవాలు

ఇబ్రహీంపట్నం రూరల్: పాఠశాలల్లో గణేశ్ ఉత్సవాలను విద్యార్థులు మంగళవారం ఘనంగా జరుపుకొన్నారు. ఆదిబట్ల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, కొంగరకలాన్ శ్రీనివాస స్మార్ట్ జీనియస్ పాఠశాలలో మట్టి గణపతులను తయారు చేసి పూజించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు పరమేష్, శ్రీనివాస స్కూల్ ప్రిన్సిపాల్ లక్కరాజు రాధిక, కరస్పాండెంట్ శ్రీనివాస్‌రావులతో పాటు విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అనుమతులు తప్పనిసరి

నిబంధనలు పాటిస్తూ వినాయక మండపాలను ఏర్పాటు చేయాలి. విగ్రహాలను ఎక్కడ ప్రతిష్ఠించిన పోలీసుల అనుమతులు పొందాలి. ఇప్పటికే డీసీపీ సునీతారెడ్డి, ఏసీపీ కేపీవీ రాజు మండప నిర్వాహకులతో సమావేశాలను నిర్వహించి అవగాహన కల్పించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించకుండా ప్రశాంతంగా ఉత్సవాలు జరుపుకోవాలి. నిబంధనలు అతిక్రమిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవు.

– మహేందర్‌రెడ్డి, సీఐ, ఇబ్రహీంపట్నం

విద్యుత్ ప్రమాదాలు రానీయొద్దు

విద్యుత్ ప్రమాదలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. మండపాలకు విద్యుత్ బిల్లులు చెల్లించాల్సిన అవసరం లేదు. మండపాల ఫొటోతో ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకొని, విద్యుత్‌శాఖ అనుమతులు తీసుకోవాలి. నాణ్యత గల సర్వీస్ వైర్, బోర్డులను ఉపయోగించాలి. వైర్ల కిందికి వేళాడకుండా ఇనుప రేకులు, రాడ్స్‌కు తగలకుండా జాగ్రత్తలు తీసుకొవాలి.

– అఖిలేష్, విద్యుత్ ఏఈ, ఇబ్రహీంపట్నం



యాచారం: మట్టి గణపతి విగ్రహాలను తయారు చేసిన విద్యార్థులు



ఇబ్రహీంపట్నంరూరల్: ఆదిబట్ల ప్రభుత్వ పాఠశాలలో..

క్లుప్తంగా

అర్హులకు సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

ఆమనగల్లు/మాడ్గుల: కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సూచించారు. హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసంలో మంగళవారం ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం లక్ష్యంగా వివిధ పథకాలు అమలు చేస్తుందన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేస్తుందని తెలిపారు. అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, శంకర్, మెకానిక్ బాబా, జగన్‌గౌడ్, విజయ్‌రాథోడ్, శ్రీశైలం యాదవ్, శ్రీనివాస్, వెంకటేశ్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాన్ని తరలించొద్దు

బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి



కలెక్టర్ నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న కిషన్‌రెడ్డి తదితరులు

ఇబ్రహీంపట్నం రూరల్: సమీకృత సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల పేరుతో ఇబ్రహీంపట్నంలో ఉన్న సబ్‌రిజిస్ట్రేషన్ కార్యాలయాన్ని తరలించే ప్రక్రియ విరమించుకోవాలని బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం కలెక్టర్ సి.నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. రిజిస్ట్రేషన్ కార్యాలయాన్ని తరలిస్తే ఊరుకునేది లేదన్నారు. ఆరు మండలాలకు అనుకూలంగా ఉన్న కార్యాలయాన్ని మంఖాలకు తరలించాలనే నిర్ణయం తగదన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభం ఏర్పాటు



నాగన్‌పల్లిలో నూతన విద్యుత్ స్తంభం ఏర్పాటు చేసిన సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

ఇబ్రహీంపట్నం రూరల్: రోడ్డు పక్కన విరిగిన విద్యుత్ స్తంభాన్ని అధికారులు తొలగించారు. 'విరిగిన స్తంభం.. ఎరగని విద్యుత్ యంత్రాంగం' అనే శీర్షికతో మంగళవారం సాక్షిలో ప్రచురితమైన వార్తకి విద్యుత్ అధికారులు స్పందించారు. మండలం పరిధిలోని నాగన్‌పల్లి నుంచి పోల్కంపల్లి గ్రామానికి వెళ్లే దారిలో ప్రభుత్వ పాఠశాలకు సమీపంలో రోడ్డు పక్కనే విరిగిన స్తంభం ప్రమాదకరంగా మారడంతో ప్రయాణికులు, విద్యార్థులు భయాందోళనకు గురయ్యారు. విద్యుత్ శాఖ అధికారులు స్తంభాన్ని పరిశీలించి అప్పటికప్పుడే కొత్త స్తంభం ఏర్పాటు చేశారు.

అంతర్గత రోడ్లకు మరమ్మతులు



అంతర్గత రోడ్డుపై మట్టి పోసి చదును చేస్తున్న డోజర్

సాక్షి ఎఫెక్ట్..

ఆమనగల్లు: పట్టణంలో అధ్వానంగా మారిన అంతర్గత రోడ్లను మున్సిపాలిటీ ఆధ్వర్యంలో మంగళవారం బాగు చేశారు. అధ్వానం.. అంతర్గత రోడ్లు అంటూ సాక్షి దినపత్రికలో సోమవారం ప్రచురితమైన కథనానికి ఆమనగల్లు మున్సిపాలిటి కమిషనర్ శంకర్ స్పందించారు. పట్టణంలో పలు కాలనీలలో గుంతలమయంగా, బురదమయంగా మారిన రోడ్లపై మట్టిని పోయించి డోజర్‌తో చదును చేయించారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ



కోర్టు ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

ఆమనగల్లు: హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి బార్ అసోసియేషన్ సభ్యుడు, న్యాయవాది శ్రీకాంత్‌పై జరిగిన దాడికి నిరసనగా ఆమనగల్లు కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు మంగళవారం విధులు బహిష్కరించారు. ఆమనగల్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యాదీలాల్ ఆధ్వర్యంలో కార్యక్రమం చేపట్టారు. అనంతరం న్యాయవాది శ్రీకాంత్‌పై దాడి జరిపిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. న్యాయవాదులకు రక్షణ చట్టాన్ని అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కార్యదర్శి ఆంజనేయులు, సభ్యులు రామకృష్ణ, శేఖర్, మల్లేశ్, వెంకట్‌గౌడ్, గణేశ్‌గౌడ్, సంతోష్, జగన్‌గౌడ్, బిక్యానాయక్, శ్రీనివాస్, సర్దార్‌నాయక్, తిరుపతయ్య, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డెక్కిన అన్నదాతలు



కడ్తాల్: యూరియా కోసం రోడ్డుపై బైఠాయించిన రైతులు

యూరియా కోసం ఆందోళన

కడ్తాల్: యూరియా కోసం రైతన్నలు రోడ్డెక్కారు. మంగళవారం మండల కేంద్రంలోని ఆగ్రోరైతు సేవా కేంద్రం వద్ద యూరియా కోసం రైతులు పెద్దఎత్తున ఆందోళన చేపట్టారు. ఉదయం 10 గంటల వరకు వేచి చూసినా యూరియా రాకపోవడంతో విసుగు చెందిన రైతులు శ్రీశైలం- హైదరాబాద్ జాతీయ రహదారిపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సకాలంలో పంటలకు యూరియాను సరఫరా చేయకుండా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం దారుణమని మండిపడ్డారు. ధర్నా విషయం తెలుసుకున్న ఎస్‌ఐ చంద్రశేఖర్ ఆందోళన చేపట్టిన ప్రదేశానికి చేరుకుని రైతులను సముదాయించారు. వ్యవసాయ శాఖ అధికారులతో మాట్లాడి యూరియా బుధవారం వస్తుందని తెలియజేయడంతో రైతులు ఆందోళనను విరమించారు.

యూరియా లేదని రైతుల ధర్నా

యాచారం: మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయం ఎదుట మంగళవారం పలు గ్రామాలకు చెందిన రైతులు ధర్నా నిర్వహించారు. రెండు రోజులుగా పీఏసీఎస్‌లో యూరియా ఎప్పుడు వస్తుందో.. రాదోననే విషయం అధికారుల నుంచి స్పష్టత లేకపోవడంతో ఆందోళనకు దిగారు. రైతులకు మద్దతుగా సీపీఎం మండల కార్యదర్శి ఆలంపల్లి నర్సింహ ఆధ్వర్యంలో పి.అంజయ్య తదితరులు నిరసనలో పాల్గొన్నారు. గంట పాటు పీఏసీఎస్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించగా స్పందించిన ఏఓ రవినాథ్ 450 బ్యాగుల ఇండెంట్ పెట్టినట్లు, మంగళవారం రాత్రి 9 గంటల వరకు లోడ్ వస్తుందని, బుధవారం ఉదయం వచ్చి రైతులు యూరియాను తీసుకెళ్లాలని సూచించారు. ఈ సందర్భంగా నర్సింహ మాట్లాడుతూ... రైతుల డిమాండ్‌ను బట్టి కావాల్సిన యూరియాను నిల్వ చేసి ఉంచడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమైనట్లు తెలిపారు.



యాచారం: పీఏసీఎస్ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం శ్రేణులు, రైతులు

రైతుల ఇబ్బందులు పట్టని ప్రభుత్వం



డీటీ వినోద్‌కు వినతిపత్రం అందిస్తున్న బీజేపీ నాయకులు

ఆమనగల్లు: రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నప్పటికీ ప్రభుత్వం మాత్రం పట్టించుకోవడం లేదని మండల బీజేపీ అధ్యక్షుడు కేకే.శ్రీనివాస్ ఆరోపించారు. రైతులకు అవసరమైన యూరియాను ప్రభుత్వం అందించాలని ఆయన డిమాండ్ చేశారు. ఆమనగల్లు పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట బీజేపీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రభుత్వం రైతుల ఇబ్బందులు గుర్తించి సాగుకు అవసరమైన యూరియాను అందించాలని కోరారు. యూరియా కోసం రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కాంగ్రెస్‌పార్టీ పాలనలో రైతులు అనేక అవస్థలు పడుతున్నా పాలకులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఎన్నికల ముందు ఎన్నో హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ వాటిని విస్మరించిందన్నారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ వినోద్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల ఉపాధ్యక్షులు శ్రీనివాస్, నాయకులు లాలునాయక్, వెంకటేశ్, వెంకటయ్య, శ్రీనివాస్‌గౌడ్, శ్రీకాంత్, బిక్యనాయక్, నర్సింహ, శివ, దేవ్లా పాల్గొన్నారు.

మట్టి గణపతి విగ్రహాల పంపిణీ



కడ్తాల్: మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న సీఐ గంగాధర్, గంప వెంకటేశ్‌గుప్తా

కడ్తాల్: ప్రతిఒక్కరూ మట్టి గణపతిని పూజించి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని సీఐ గంగాధర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో గంప లక్ష్మయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చైర్మన్ గంప వెంకటేశ్ గుప్తా భక్తులకు మట్టి గణపతి ప్రతిమల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీఐ గంగాధర్ హాజరై మాట్లాడారు. పదేళ్ల పర్యావరణహిత మట్టి గణపతులను ఉచితంగా అందజేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ చంద్రశేఖర్, బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి రాఘవేందర్, ఆర్యవైశ్య సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

టెలిఫోన్‌కాలనీలో..

తుర్కయంజాల్: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని కస్తూరి ఫౌండేషన్ చైర్మన్ శ్రీచరణ్, సభ్యుడు ఉదావత్ లచ్చిరామ్ అన్నారు. మంగళవారం పురపాలక సంఘం పరిధి మునగనూర్‌లోని టెలిఫోన్ కాలనీలో మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు వెంకట్ రెడ్డి, మోహన్‌గుప్తా, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.



తుర్కయంజాల్: మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేస్తున్న నాయకులు

మానవతామూర్తి మదర్ థెరిసా



మదర్ థెరిసా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

కడ్తాల్: మానవతామూర్తి మదర్ థెరిసా జయంతిని డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రేమ, దయ, సేవ కార్యక్రమాలతో జీవితాంతం పేదల కోసం కృషి చేసిన ఆమె సేవలు మరువలేనివి అన్నారు. కార్యక్రమంలో రాజేశ్, రవి, వినోద్ నాయక్, భానుకిరణ్, రామకృష్ణ, రమేశ్, శ్రీకాంత్, సందీప్, మల్లేశ్, చందు, వినీల్‌నాయక్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.